క్లుప్తంగా

విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

తొండూరు : తొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం అభ్యసనా సామగ్రిని పంపిణీ చేశారు. వేంపల్లెకు చెందిన ఉషాకిరణ్ స్కూల్ కరెస్పాండెంట్ బీఆర్ రమణారెడ్డి రూ.2 వేల విలువ చేసే పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కేవీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో పరిశుభ్రత పనులు



కలుపు మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణలో వ్యర్థాలు, కలుపు మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు జయమ్మ, నివేదితలు పరిశుభ్రతా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సాయి శ్రీనివాస్, ఎన్.వి.సుబ్బారెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ తోటల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ

పులివెందుల రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చీనీ తోటలను కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బాలకృష్ణ సోమవారం పరిశీలించారు. తోటలో వేరుకుళ్లు, మంగు, పొలుసు తెగుళ్లను గుర్తించి, వాటి నివారణ మార్గాలను రైతులకు సూచించారు. వేరుకుళ్లు నివారణకు ట్రైకోడెర్మా జీవ శిలీంద్రాన్ని పశువుల పేడతో కలిసి బెల్లపు నీటితో మిశ్రమాన్ని తడుపుతూ పది రోజులు నిల్వ ఉంచి చీనీచెట్ల మొదళ్ల నుంచి కొంచెం దూరంలో వేసుకోవాలి. మంగు, పొలుసు తెగుళ్లకు వివిధ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను సూచించారు. రసాయనాలైన ప్రొఫెజిట్ 1.5 మి.లీ (లేదా) స్పైరోమేసిఫిన్ 2 మి.లీ ఒక చెట్టుకు అందేలా పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, వీహెచ్ఏ, చీనీ రైతులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం



వర్షాల కోసం అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ముద్దనూరు : సకాలంలో వర్షాలు కురిసి కరువు తీరాలని గ్రామస్తులు శివునికి జలాభిషేకం చేశారు. సోమవారం మండలంలోని ఉప్పలూరు శివాలయంలో గ్రామస్తులు 101 బిందెల నీటితో శివలింగానికి అభిషేకం చేశారు. పరమేశ్వరుడిని వర్షాలు కురవాలని ప్రార్థించినట్లు స్థానికులు తెలిపారు.

పెన్నానదికి నీరు నిలుపుదల



పెన్నానదిలో స్వల్పంగా ప్రవహిస్తున్న నీరు

జమ్మలమడుగు : మైలవరం జలాశయం నుంచి నాలుగు రోజులుగా పెన్నానదికి వదులుతున్న నీటిని గేట్లను మూసి నిలుపుదల చేసినట్లు జలాశయ ఏఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. 20 రోజులుగా మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి ఐదు వందల క్యూసెక్కుల మొదలుకొని, అత్యధికంగా 10,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సెప్టెంబర్ నెలలో మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోనికి నాలుగు టీఎంసీల నీరు ప్రవహించి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని బాధిత అభ్యర్థులు సాయి, ప్రకాశ్, రమ్యతేజ, అవినాష్ కోరారు. కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. 2020 తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగినా, ఇంత వరకూ నియామకపత్రాలు ఇవ్వలేదన్నారు

అంగన్‌వాడీల్లో మరింత పౌష్టికాహారం



అంగన్‌వాడీ కేంద్రం పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ సునీత

వేంపల్లె : మహిళలు, పిల్లలు, కిశోర బాలికలు ఎవరూ కూడా లోప పోషణకు గురికాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం శక్షం అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించిందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.సునీత అన్నారు. సోమవారం సాక్షం అంగన్వాడీ కేంద్రాలుగా ఎంపికైన స్థానిక క్రిస్టియన్ కాలనీ, ప్రియాతోట, బిడాలమిట్ట ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. సాక్షం కేంద్రాల్లో పోషణ వాటిక, రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, ఆర్వో సిస్టమ్, ఎల్ఇడి టివి తదితర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జాతీయ పోషణ మాసం ముగింపు సందర్భంగా దేశ వ్యాప్తంగా 11 వేల అంగన్వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఎంపికైన కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, వీటిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ శక్షం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం బాగుంటుందని, దీంతో పిల్లలు, తల్లులు లోప పోషణ నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, నాగరత్న, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటలక్షుమ్మ, సీహెచ్ఓ వెంకటరత్నం, ఏఎన్ఎం లక్ష్మీదేవి, మహిళా పోలీసు అర్చన, అంగన్వాడీ కార్యకర్తలు రమాదేవి, సుజాత, సరస్వతి, ఎంపీటీసీ మణిగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగన్న, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు

చింతకొమ్మదిన్నె : మండలంలోని తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలను సాక్ష్యం అంగన్వాడీ కేంద్రాలుగా మారుస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి శ్రీధర్ తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ సాక్ష్యం కేంద్రంలో పోషణ వాటిక, రైన్ వాటర్ హార్వెస్టింగ్, ఆర్వో వాటర్, ఎల్ఈడీ టీవీలతోపాటు ఇతర సామగ్రి, వసతి ఏర్పాటు చేస్తారన్నారు. తొలి విడతగా తాడిగొట్ల, బుగ్గలపల్లి హరిజనవాడ అంగన్వాడీ కేంద్రాలలో ఈ ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంఈవో వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్లు శ్రీదేవి, గుర్రమ్మ పాల్గొన్నారు.

పర్యాటక పురస్కార గ్రహీతకు సన్మానం



బాలగొండ గంగాధర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

వేంపల్లె : వేంపల్లె వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 2023–24 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ప్రకటించిన ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్ బహుమతి పొందిన బాలగొండ గంగాధర్‌ను కళాశాల ప్రిన్సిపల్, బోధన సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ యోగాంజనేయులు మాట్లాడుతూ రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ పొందుతున్న పర్యాటక రంగంపై విశిష్ట రచనలు చేసి రాష్ట్ర ప్రభుత్వ అవార్డు పొందిన గంగాధర్ తమ కళాశాలలో ఉండడం అదృష్టమని కొనియాడారు. గతంలో కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో పర్యాటక కోర్సును ప్రారంభించి వందలాది మంది విద్యార్థులను పర్యాటక రంగంలో నిపుణులుగా తయారు చేయడంలోపాటు పర్యాటక రంగ ప్రాముఖ్యతను వివరిస్తూ అనేక వ్యాసాలు రాయడం కూడా జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

2న పుష్పగిరిలో ఉచిత సామూహిక పిండ ప్రదానం

వల్లూరు : మహాలయ అమావాస్య సందర్భంగా పుష్పగిరి చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలోని పెన్నానది ఒడ్డున ఉచిత సామూహిక పిండ ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. వారు మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం అన్నదానం వుంటుందని తెలిపారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలకు పిండ ప్రధానం చేయవచ్చునని తెలిపారు. దేవస్థానం ఇందుకు కావాల్సిన పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, పూలు, ఊది బత్తీలు, కర్పూరం, విస్తరాకులు, బియ్యం పిండి, నువ్వులు, దర్భ పవిత్రములు ఉచితంగా అందజేస్తుందన్నారు. భక్తులు పంచ, టవలు, చెంబు, గ్లాసు, ఉద్ధరేణి లేదా స్పూను, తట్ట, ఉన్నవారు యజ్ఞోపవీతం తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి



వైఎస్సార్‌సీపీ నూర్ బాష సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నూర్ బాష సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ సాహెబ్ కోరారు. సోమవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి వంద రోజులు అయినా అమలు చేయకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత రావడం జరిగిందన్నారు. వీటి నుంచి బయటపడేందుకు శ్రీ వెంకటేశ్వరస్వామిని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నాడని విమర్శించారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించి, భక్తుల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. చంద్రబాబు కడప పెద్ద దర్గాను దర్శించినప్పుడు డిక్లరేషన్ ఇచ్చాడా అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రజలచేత ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి కాదని, ఈవీఎంల ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

జమ్మలమడుగు : నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్యులు, పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, దీనికి తోడు పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సామాన్యులు మూడు పూటలా భోజనం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరామిరెడ్డి

జమ్మలమడుగు : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. సోమవారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను డీఈ బాల మల్లేష్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు లాభాపేక్షతో కాకుండా సేవాభావంతో మన్నికగా ఉండేలా పనిచేయాలన్నారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు కాలువల నిర్మాణం చేపడితే డ్రైనేజీ సమస్య ఉండదని చెప్పారు.

బాధ్యతల స్వీకరణ



కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ జ్ఞానానందరెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా జ్ఞానానందరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన మాజీ వీఆర్ఓ దానంరెడ్డి పెద్దిరెడ్డి, అరుణకుమారి దంపతుల కుమారుడు. జ్ఞానానంద రెడ్డి గతేడాది విడుదలైన గ్రూప్–1 ఫలితాలలో ప్రతిభ చూపి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ అధికారిగా ఎంపికయ్యారు. ఇతను విజయవాడ కమర్షియల్ ట్యాక్స్ ప్రధాన కార్యాలయంలో 12 నెలల శిక్షణ పూర్తి చేసుకుని అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీటీఓ జ్ఞానానందరెడ్డి మాట్లాడుతూ ట్యాక్స్ ఎగవేత జరగకుండా ప్రభుత్వానికి సకాలంలో పన్ను చెల్లించేలా డీలర్లకు అవగాహన కల్పించి తనవంతు బాధ్యత నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీటీఓ అనిత, జీఎస్టీఓలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లా ఎస్‌జీఎఫ్ పోటీలకు అంగడివీధి హైస్కూల్ విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన అంగడి వీధి హైస్కూల్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్/చింతకొమ్మదిన్నె : కడప అంగడి వీధి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కడప జిల్లా గంగాయపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో వారు ప్రతిభ చూపారు. అండర్–14 వాలీబాల్ పోటీల్లో మరియం, దివ్య తేజస్విని, సమియాతంజీల్, అండర్–17 వాలీబాల్ పోటీల్లో అక్షయమానస, నిహారిక, ఖోఖోలో యువరాజు, సమియతంజీల్, అండర్ –17 ఖోఖోలో సమద్ అలీఖాన్, అండర్ –17 వాలీబాల్‌లో నందకిషోర్, కబడ్డీలో మరియం, ఖోఖో సమియ తంజీల్ ఎంపికైనట్లు హెచ్‌ఎం వేంకటేశ్వర రెడ్డి తెలిపారు.

దసరాకు ఆలయాలు ముస్తాబు



అంబభవాని ఆలయం వద్ద వేస్తున్న చలువ పందిళ్లు

జమ్మలమడుగు : దసర ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారు ప్రతి రోజూ ఒక్కో దివ్య అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆలయాలను వివిధ రకాల పూలు, తోరణాలు, విద్యుత్‌దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. అక్టోబర్ 3వ తేదీ నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంతో పాటు, అంబభవాని ఆలయం, తొగటవీర క్షత్రియుల ఆధ్వర్యంలో నాగులకట్టలోని చౌడేశ్వరి దేవి ఆలయాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఆలయ కమిటి సభ్యులు ఆలయం ముందు చలువ పందిళ్లు, విద్యుత్‌దీపాలు, కటౌట్లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఎంఈఓకు వీడ్కోలు



మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల విద్యాధికారి–2 వేంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా సోమవారం సాయంత్రం ఎంపీడీఓ సభ భవనంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ ఎంఈఓ–2 వేంకటేశ్వర్లు చాలా సౌమ్యుడు అని అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సర్వ సాధారణమని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

హిందీ భాష అమలులో ఎల్‌ఐసీ అగ్రగామి



బహుమతిని అందజేస్తున్న ఎల్ఐసీ అధికారులు

కడప కల్చరల్ : హిందీ భాష అమలులో జీవిత బీమా సంస్థ అగ్రగామిగా నిలుస్తోందని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ.రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన హిందీ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ జాతీయ సమైక్యతను కాపాడడంలో హిందీ పోషించిన పాత్ర గణనీయమైనదని అన్నారు. అనంతరం సంస్థ నిర్వహించిన హిందీ అనువాదం, ధారణ, పాటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ భాషను తెలుగులోకి అనువాదం చేయడంలో వై.శ్రీవాణి, ఆంగ్ల భాషా పదాలను హిందీలోకి అనువాదం, మెమరీ టెస్ట్‌లో జి.లీలాలక్ష్మీ, పాటల పోటీలో ఎంసీ.సుబ్బరాయుడు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో ఆర్.శ్రీధర్, శ్యామ్ సుందర్‌రావు, సత్య శ్రీనివాస్, రమేష్‌బాబు, హరేంద్ర, బాబు, జె.రఘు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యాశాఖకు అప్పగించాలి

కడప ఎడ్యుకేషన్ : కడప కార్పొరేషన్ స్వాధీనంలో ఉన్న సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యా శాఖకు అప్పగించాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) కడప జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శి షేక్ మహమ్మద్ ఇర్షాద్ డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని పరిపాలనాధికారి విజయ్‌కుమార్‌ను వారు సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కడప–చెన్నూరు బస్టాండ్ వద్ద విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యావసరుల కేంద్రం, సైన్స్ మ్యూజియం నిర్మించి వాడుకునేవారన్నారు. గత కొంతకాలంగా నిధుల కొరతతో ప్రదర్శనలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ భవనాలను కార్పొరేషన్ అధికారులు ఆధార్ సెంటర్‌కు వినియోగిస్తున్నారన్నారు. సైన్స్ ప్రదర్శనలను పునరుద్ధరించేందుకు సమగ్ర శిక్ష పథకం నుండి రూ.12 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. సైన్స్ మ్యూజియం భవనాన్ని విద్యా శాఖకు అప్పగిస్తే ప్రదర్శనలు నిర్వహించేందుకు వీలుంటుందని తెలిపారు.

కాంట్రాక్టు ఫ్యాకల్టీ జీతాలు పెంచాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో పని చేసే కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఉద్యోగుల జీతాలను పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుసేన్ చెప్పారు. సోమవారం సీఐటీయూ పిలుపు మేరకు సెప్టెంబర్ 30వ తేదీని డిమాండ్ దినోత్సవంగా ప్రకటించడంతో సీఐటీయూసీకి మద్దతుగా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ బయట కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు చాలీచాలని జీతాలు ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉద్యోగుల కుటుంబాలు చాలా హీన స్థితిలో ఉన్నట్లు చెప్పారు. కాబట్టి ఒకే పని – ఒకే జీతం, సమాన పనికి – సమాన వేతనం అనే జీఓను తెచ్చి జీతాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఉద్యోగులను పర్మినెంటు చేయాలని కోరారు.

ప్రణాళికాబద్ధంగా చదివి మార్కులు సాధించాలి



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న వీర నారాయణ

కమలాపురం : విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి మార్కులు సాధించాలని మండలంలోని నల్లింగాయపల్లె, ఎర్రగుడిపాడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రహమత్ బషీర, చంద్రశేఖర్ అన్నారు. నల్లింగాయపల్లె హైస్కూల్ విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలు, ఎర్రగుడిపాడు హైస్కూల్ విద్యార్థులకు చెస్ బోర్డ్స్, ఫైల్స్, బ్యాగ్స్ సోమవారం వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర సమావేశానికి హాజరు కావడం లేదు



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ మార్పురి మేరి

కమలాపురం : కమలాపురం పురపాలక అత్యవసర సమావేశానికి తామంతా హాజరు కావడంలేదని మున్సిపల్ ఛైర్ పర్సన్ మార్పురీమేరి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ గతంలో జరిగిన సమావేశంలో మెయింటెనెన్స్ పనులకు ఆమోదం తెలిపినా.. ఇప్పటి వరకు బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ఈ సమావేశానికి హాజరవ్వాలని అధికారులు నోటీసులు జారీ చేశారని, అయితే కొత్త పనులకు ఆమోదం తెలపాల్సిన అవసరం తమకు లేదని అన్నారు. ఈ సమావేశంలో టౌన్ కన్వీనర్ గంగాధర రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మహ్మద్ సాధిక్, మారుజోళ్ల శ్రీనువాసులురెడ్డి, కౌన్సిలర్లు సలీల, నాగమణి, ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



సాక్షి మీడియా గ్రూపు ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఎర్రగుంట్ల : తాను చదివిన పాఠశాలను మరువకుండా ఆర్థిక సాయం అందించి ఈతరం విద్యార్థులకు సాక్షి మీడియా గ్రూపు ఫైనాన్స్ డైరెక్టర్ యర్రంరెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి వసతులు కల్పించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పించిన జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్న ఆలోచనతో విద్యార్థుల సైకిల్ స్టాండ్ ఏర్పాటుకు ఆయన రూ.2.50 ఆర్థిక సాయం చేశారు. అంతేకాకుండా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10,116 నగదు పారితోషకం అందిస్తూ.. ప్రోత్సహిస్తున్నారని ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి కొనియాడారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఈశ్వరప్రసాద్‌రెడ్డిని పాఠశాల తరుపున ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయుడు తుపాకుల చంద్ర ఓబుళరెడ్డితో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

టాలెంట్ టెస్ట్‌లో ర్యాంకులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెడ్మాస్టర్ నాగాంజనేయులు

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు హెడ్మాస్టర్ నాగాంజనేయులు తెలిపారు. జిల్లా కలెక్టర్ కలెక్టర్ లోతేటి శివశంకర్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఆర్.జస్వంత్ కుమార్‌రెడ్డి 1వ ర్యాంకు, జిల్లాలో 13వ డివిజన్ పరిధిలో ఎనిమిదవ ర్యాంకు యోగామృత, 5వ ర్యాంకు కె.హిమవర్ధనరెడ్డిలు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. తమ పాఠశాల విద్యార్థులు ర్యాంకులు సాధించడం పట్ల హెడ్మాస్టర్‌తో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. అలాగే ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన బి.ఓబుల్‌రెడ్డి విహారయాత్రకు గాను ఒక్కొక్క విద్యార్థికి రూ.1000 చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేశారు.

మంత్రి పర్యటనలో రుసరుసలు



గజమాలతో మంత్రికి స్వాగతం పలుకుతున్న స్థానికుడు

వల్లూరు(చెన్నూరు) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన సందర్భంగా మండల బీజేపీ నేతల మధ్య రుసరుసలు బయటపడ్డాయి. చెన్నూరు మండలం మీదుగా కడపకు వెళ్తున్న ఆయనకు ఏ పార్టీయో తెలియని ఓ వ్యక్తి గజమాలతో సత్కరించడంతో బీజేపీ వర్గాలు ఆశ్చర్యానికి గురయ్యారు. బీజేపీ సభ్యత్వం కూడా లేని వ్యక్తి మంత్రి వద్దకు రావడంపై ఆ పార్టీ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనికి తోడు మండల పార్టీ నాయకులు జిల్లా స్థాయి నాయకుడిపై ఆరోపణలు చేయడం, స్థానిక నేతలు కలిసి ఇద్దరు నాయకులను సస్పెండ్ చేయాలని జిల్లా అధినాయకత్వానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించాయి. సోమవారం జరిగిన కార్యక్రమంలో నాయకుల మధ్యం ఈ వ్యవహారంపై జోరుగా చర్చ జరిగినట్లు సమాచారం.